ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తమిళనాడు
TAMILNADU
గురువారం 29 మే 2025



పెద్దల సభకు కమల్

• డీఎంకే రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదల



చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో డీఎంకే తరఫున పోటీ చేయనున్న ముగ్గురు అభ్యర్థుల జాబితాను పార్టీ అధిష్ఠానం బుధవారం ఉదయం ప్రకటించింది. అదే సమయంలో తన మిత్రపక్షమైన మక్కల్ నీది మయ్యంకు ఒక సీటు కేటాయిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఎంఎన్ఎం నేత కమల్‌హాసన్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు బుధవారం జరిగిన ఆ పార్టీ కార్యాచరణ మండలి సమావేశంలో తీర్మానం చేశారు. డీఎంకే అభ్యర్థుల వివరాలు...

పి.విల్సన్...



డీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది పి.విల్సన్ రెండోమారు రాజ్యసభకు పోటీ చేయనున్నారు. విల్సన్ పూర్తిపేరు పుష్పనాథన్ విల్సన్, 2012 ఆగస్టు నుండి 2014 మే వరకు ఆయన కేంద్ర ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్‌గా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వ అదనపు న్యాయవాదిగా 2008 నుండి 2011 వరకు పనిచేశారు.

కవయిత్రి సల్మా...



ఇదే విధంగా డీఎంకే తరఫున తమిళ కవయిత్రి సల్మా రాజ్యసభకు పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. సల్మా కలం పేరు రాజాత్తి. ఆ తర్వాత రాజాత్తి సల్మా అని కూడా పిలుస్తారు. వర్ధమాన కవుల్లో సల్మా ప్రత్యేక స్థానం ఉంది.. ఎన్నో యేళ్లుగా డీఎంకే సభ్యురాలిగా ఆ పార్టీకి సేవలందించారు.

ఎస్ఆర్ శివలింగం...



రాజ్యసభ ఎన్నికల్లో డీఎంకే మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ శివలింగంకు కూడా అవకాశం లభించింది. శివలింగం 1989, 1996 శాసనసభ ఎన్నికల్లో సేలం జిల్లా పనమరత్తుపట్టి నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. పార్టీ సీనియర్ సభ్యుడిగా, సేలం జిల్లాలో పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలందించినందుకుగాను పార్టీ అధిష్ఠానం ఆయనను రాజ్యసభకు ఎంపిక చేసింది. రాజ్యసభ ఎన్నికల్లో డీఎంకే, దాని మిత్రపక్షాలకు ఉన్న సభ్యుల ప్రకారం నలుగురిని రాజ్యసభ ఎంపీలుగా గెలిపించే అవకాశం ఉంది.

విద్యార్థినిపై అత్యాచారం కేసులో.. జ్ఞానశేఖరన్ దోషి

• తీర్పునిచ్చిన మహిళా కోర్టు మేజిస్ట్రేట్ • 2న శిక్ష వెల్లడి

ప్యారీస్, మే 28 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో ఓ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో అరెస్టయిన, కోట్టూరుపురంకు చెందిన జ్ఞానశేఖరన్‌ను దోషిగా నిర్ధారిస్తూ చెన్నై మహిళా కోర్టు న్యాయమూర్తి రాజలక్ష్మి ప్రకటించారు. అతడిపై పోలీసులు చేసిన నేరారోపణలకు సంబంధించి స్పష్టమైన ఆధారాలున్నాయని, జూన్ 2న శిక్ష విధిస్తామని పేర్కొన్నారు. గిండీలోని అన్నావర్శిటీ ప్రాంగణంలో గత ఏడాది డిసెంబర్ 23వ రాత్రి విద్యార్థినిని బెదిరించిన జ్ఞానశేఖరన్ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఫిర్యాదు ఆధారంగా కోట్టూరుపురం మహిళా పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరిపి, అడయార్ ప్రాంతంలో టిఫిన్ సెంటర్ నడిపే కోట్టూరుపురంకు చెందిన జ్ఞానశేఖరన్ (37)ను అరెస్టు చేశారు.అతడు అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు విచారించిన న్యాయమూర్తులు ఎస్ఎన్ సుబ్రమణ్యం, లక్ష్మీనారాయణలతో కూడిన ధర్మాసనం ఈ అత్యాచారం కేసు విచారణకు ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారులతో కూడిన సిట్‌ను నియమించింది. ఆ మేరకు ఆ బృందం మార్చిలో బాధితురాలితో పాటు 29 మందిని విచారించి, ఆధారాలతో నివేదిక తయారుచేసి చార్జీషీటును న్యాయస్థానంలో దాఖలుచేసింది. చెన్నై మహిళా కోర్టులో మార్చి నుండి విచారణ ప్రారంభం కాగా, జ్ఞానశేఖరన్‌కు మద్దతుగా వాదించేందుకు ఒక్క న్యాయవాది కూడా ముందుకు రాలేదు. దీంతో అతడి తరుఫున వాదించేందుకు న్యాయవాదులు కోదండరామన్, జయప్రకాశ్‌లను లాబోర్డు నియమించింది. ఆ తర్వాత ఏప్రిల్ 23న సాక్షుల విచారణ ప్రారంభంకాగా, పోలీసుల తరుఫున న్యాయవాదిగా మేరీ జయంతి వ్యవహరించారు. కాగా, అందరి వాదనలు పూర్తైన నేపథ్యంలో మే28న తీర్పును వెలువరించనున్నట్లు న్యాయమూర్తి రాజలక్ష్మి గతవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో, జ్ఞానశేఖరన్ నేరస్థుడేనని 157 రోజుల అనంతరం న్యాయమూర్తి రాజలక్ష్మి తన తీర్పులో వెలువరించారు. ఆ మేరకు జ్ఞానశేఖరన్ ఎదుర్కొంటున్న 11 రకాల నేరారోపణలకు ఆధారాలున్నాయని, శిక్ష వివరాలను జూన్ 2న వెల్లడించనున్నట్లు ప్రకటించిన న్యాయమూర్తి, అప్పటివరకు జ్ఞానశేఖరన్‌ను జుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



జ్ఞానశేఖరన్‌ను వ్యానులో ఎక్కిస్తున్న పోలీసులు - ఇన్‌సెట్‌లో దోషి

విలపించిన జ్ఞానశేఖరన్...

మహిళా కోర్టు న్యాయమూర్తి రాజలక్ష్మి ఇచ్చిన తీర్పు విన్న వెంటనే జ్ఞానశేఖరన్ విలపించాడు. ముందుగా కేసు విచారణ ప్రారంభమైన వెంటనే తనకు కఠిన శిక్ష విధించరాదని జ్ఞానశేఖరన్ అభ్యర్థించాడు. తన తండ్రి మరణించిన తర్వాత తల్లి, సోదరి, భార్య, కుమార్తెలను పోషించుకునే బాధ్యత తనపైవుందని, స్తంభింపజేసిన తన బ్యాంకు ఖాతా విడుదల చేయాలని కోరాడు. ప్రభుత్వం తరఫు న్యాయవాదులు జోక్యం చేసుకుని జ్ఞానశేఖరన్‌కు చేసిన నేరం చాలా తీవ్రమైనదని, అతడికి యావజ్జీవ శిక్ష విధించాలని, అతడిపై ఏ మాత్రం దయచూపరాదని కోరారు. ఆ వాదనలు విన్న అనంతరం కోర్టు వెలువరించిన తీర్పు మేరకు పోలీసులు జ్ఞానశేఖరన్‌ను పుళల్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో, జ్ఞానశేఖరన్ నేరస్థుడేనని కోర్టు తీర్పును అన్ని రాజకీయ పార్టీలు స్వాగతించాయి.

ఎవరా సార్? ఈ ప్రశ్నకు జవాబు లేదు : ఈపీఎస్

జ్ఞానశేఖరన్ దోషి అని న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పలు అనుమానాలు వ్యక్తం చేశారు. విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో కీలకపాత్ర పోషించిన ఆ సార్ ఎవరన్న ప్రశ్నకు ఇంకా జవాబు రాలేదని వ్యాఖ్యానించారు జ్ఞానశేఖరన్ ఇంట్లో జరిగిన విందులో పాల్గొన్న రాష్ట్రానికి చెందిన ఓ మంత్రి, జీసీసీ డిప్యూటీ మేయర్‌లను ఈ కేసులో ఎందుకు విచారించలేదని, సిట్‌లో పనిచేసిన డీఎస్పీ రాఘవేంద్ర రవి ఎవరి ఒత్తిళ్ల వల్ల రాజీనామా చేశారో ఇప్పటి వరకు ప్రభుత్వం నోరువిప్పలేదని విమర్శించారు. వచ్చే ఏడాది రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ సార్ ఎవరనేది గుర్తించి శిక్ష పడేలా చేస్తానని తెలిపారు.

సీఎం చెప్పేవన్నీ అబద్ధాలే: విజయ్

అన్నావర్శిటీలో విద్యార్థినిపై అత్యాచారం కేసులో ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పేవన్ని అబద్ధాలేనని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన ఎక్స్‌పేజీలో విమర్శించారు. అధికార డీఎంకేకు చెందిన జ్ఞానశేఖరన్ నేరస్థుడేనని తీర్పురావడం టీవీకే స్వాగతిస్తోందని ఈ కేసులో ప్రభుత్వ వైఫల్యాన్ని మరుగున పరచేందుకు డీఎంకే చేసిన ప్రయత్నాలపై తాను రాష్ట్ర గవర్నర్‌ను కలిసి బాధిత విద్యార్థినికి తగిన న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. మద్రాస్ హైకోర్టు పరివేక్షణలో విచారణ జరపడంవల్లే ఈ కేసు తీర్పు ఐదు నెలల్లోనే వెలువడిందని, అయితే రాష్ట్రప్రభుత్వం చూపిన చొరవ వల్లే తీర్పు త్వరగా వచ్చిందని ముఖ్యమంత్రి స్టాలిన్ అబద్ధాలు చెబుతున్నారని మండిపడిన విజయ్, ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన డీఎంకే ప్రభుత్వాన్ని మరో పది నెలల్లో ఇంటికి సాగనంపేందుకు రాష్ట్రప్రజలు సిద్ధంగా వున్నారని జ్యోష్యం చెప్పారు.

నేరస్థులకు శిక్ష కఠినంగా ఉండాలి: బీజేపీ

మహిళలను లైంగికంగా వేధించే నేరస్థులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై డిమాండ్ చేశారు. మహిళా కోర్టు తీర్పును స్వాగతిస్తూ వారు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పలుకుబడి కలిగిన జ్ఞానశేఖరన్ నేరం చేసినట్లు అందరికంటే ముందు ప్రకటించింది బీజేపీనేనని, మహిళలకు ఇప్పటికైనా తగిన భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఐదు నెలల్లో సంచలనాత్మక తీర్పు...

అన్నావర్సిటీలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసు తీర్పు ఐదు నెలల్లో తీర్పు రావడాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ స్వాగతించారు. ఈ తీర్పుపై ఆయన తన ఎక్స్‌పేజీలో పోస్టు చేసిన వివరాలిలా ఉన్నాయి. విద్యార్థినికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా నమోదైన కేసును వేగవంతం చేసి, ఐదు నెలల్లోనే తీర్పు రావడానికి కారకులైన పోలీసుశాఖకు, దర్యాప్తు అధికారులకు, ప్రభుత్వం తరుఫు న్యాయవాదులకు సీఎం స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని, నేరాలు తగ్గించేందుకు పోలీసుశాఖకు అవసరమైన స్వేచ్ఛ కల్పించినట్లు సీఎం తెలిపారు.

157 రోజుల్లోనే....

ఈ తీర్పుపై డీఎంకే ఎంపీ కనిమొళి స్పందిస్తూ, గత ఏడాది డిసెంబర్‌లో విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నేరస్థుడిని అరెస్టు చేసి విచారణ పూర్తిచేసి చార్జిషీటు దాఖలు వరకు పోలీసులు సమర్థవంతంగా పనిచేశారని తెలిపారు. ఈ కేసులో 157 రోజుల్లో తీర్పు రావడం స్వాగతించదగ్గదని, నేరస్థులు ఎంతటి వారైనా తప్పించుకోలేరని కనిమొళి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

పెరియార్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీపై వేటు

• నిర్వహణ కమిటీని నియమించిన ప్రభుత్వం

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): పెరియార్ విశ్వవిద్యాలయ సిండికేట్ కమిటీ సిఫార్సు మేరకు, ఇన్ ఛార్జి ఉప కులపతిగా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ పెరియస్వామిని ఆ పదవి నుంచి తొలగించారు. అలాగే, ప్రభుత్వ కార్యదర్శి నేతృత్వంలో సిండికేట్ కమిటీ సభ్యులు ముగ్గురితో నిర్వహణ కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

పెరియార్ వర్సిటీ 8వ ఉపకులపతిగా వ్యవహరించిన ప్రొఫెసర్ జగన్నాథన్ పదవీకాలం పూర్తిగా వివాదాస్పదంగా సాగింది. ప్రభుత్వ అనుమతి లేకుండా, ఆదాయం పొందేలా ట్రస్ట్ ప్రారంభించారనే ఫిర్యాదుతో అరెస్టయిన ఆయన బెయిలుపై విడుదలయ్యారు. ఆయన గవర్నర్‌కు విశ్వాసపాత్రుడిగా ఉంటూ, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జగన్నాథన్ పదవీకాలం పూర్తికావడంతో గవర్నర్ మరో ఏడాది పొడిగించారు. ఆ ప్రకారం, ఈ నెల 19వ తేదీతో జగన్నాథన్ పదవీకాలం ముగిసింది. ఆ ప్రకారం, సాధారణంగా ఉపకులపతి ఎంపికకు సెర్చి కమిటీ నియమించకుండా, తనకు విశ్వాసంగా ఉంటున్న తమిళ శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ పెరియస్వామిని ఇన్‌ఛార్జి ఉపకులపతిగా జగన్నాథన్ నియమించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉప కులపతి నియమాకం చేపట్టారంటూ వారం రోజులుగా వర్సిటీలో పలురకాలుగా ఆందోళనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం వర్శిటీ సిండికేట్ సమావేశం జరిగిన నేపథ్యంలో, వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీగా ఉన్న పెరియస్వామిని ఆ పదవి నుంచి తొలగిస్తూ తీర్మానం చేశారు. అలాగే, వర్శిటీ సాధారణ పనులు పర్యవేక్షించేలా కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ సుందరవల్లి నేతృత్వంలో సిండికేట్ కమిటీ సభ్యులు సుబ్రమణి, ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ జయంతి తదితరులతో కూడిన కమిటీ ఏర్పాటుచేశారు.

కచ్చాదీవి విముక్తితోనే జాలర్ల సమస్యకు పరిష్కారం

• సీఎం స్టాలిన్ • తిరువొత్తియూరు తీరంలో చేపలరేవు ప్రారంభం



చేపల రేవును ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జాలర్ల సమస్య శాశ్వత పరిష్కారానికి కచ్చాదీవికి విముక్తి కలిగించడం మినహా మరో గత్యంతరం లేదని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కచ్చాదీవిని మళ్లీ భారత భూభాగంలోకి చేర్చి తమిళ జాలర్లను శ్రీలంక నావికదళం దాడుల నుండి కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏప్రిల్ 2న శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేసి ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చెప్పారు. రాష్ట్ర మత్స్య, జాలర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తిరువొత్తియూరు తీరంలో రూ.272.70 కోట్లతో నిర్మించిన చేపల రేవును సీఎం ప్రారంభించారు. బుధవారం ఉదయం తిరువొత్తియూరులో జరిగిన కార్యక్రమంలో ఈ రేవు ప్రారంభోత్సవంతో పాటు రూ.426.13 కోట్లతో పునర్నిర్మించిన రేవులు, చేపల అన్‌లోడింగ్ కేంద్రాలు, చేపల సంతానోత్పత్తి కేంద్రాలు సహా 13 పథకాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. రామనాథపురం జిల్లా తంగచ్చిమఠం, రేష్మానగర్ జాలర్ల గ్రామంలో మొత్తం రూ.170 కోట్ల అంచనా వ్యయంతో చేపల అన్‌లోడింగ్ కేంద్రాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 2290 మంది జాలర్లకు రూ.10.67 కోట్ల విలువైన సహాయాలను కూడా పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లలో 185 పడవలు స్వాధీనం చేసుకుని, 1383 మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అక్రమంగా నిర్బంధించిందని, ఆ పడవలను విడిపించేందుకు జాలర్లను విడుదల చేయించేందుకు తాను కేంద్రానికి ఇప్పటి వరకూ 76 లేఖలు రాసినట్లు తెలిపారు. అందువలనే 1354 మంది జాలర్లు విడుదలయ్యారని, మిగతా 29 మంది జాలర్లను విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వంతో కలిసి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పళవేర్కాడు నుంచి కోవళం దాకా జాలర్ల గ్రామాలు ఉన్నాయని, ఆ జాలర్ల శ్రమవల్లే మత్స్యశాఖ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఆ జాలర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, జాలర్లకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనితా రాధాకృష్ణన్, పీకే శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాసామి, శాసనసభ్యులు కేపీ శంకర్, మాధవరం సుదర్శనం, ఆవడి శేఖర్, తాయగం కవి, దురై చంద్రశేకర్, కాదర్‌భాషా ముత్తురామలింగం, ఎంకే మోహన్, జోసెఫ్ సామువేల్, ఎబినేజర్, మూర్తి, రాష్ట్ర మత్స్యాభివృద్ధి సంస్థ చైర్మన్ గౌతమన్, జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ జక్డే తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు

• జీసీసీ సమావేశంలో తీర్మానం



కార్పొరేషన్ సమావేశంలో మేయర్ ప్రియ, కార్పొరేటర్లు

చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో మెరీనాబీచ్, బీసెంట్‌నగర్ బీచ్ సహా తొమ్మిది ప్రాంతాలలో ఎలక్ట్రిక్ వాహనాల కోసం ప్రత్యేక ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని బుధవారం జరిగిన గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ సమావేశం తీర్మానించింది. మేయర్ ఆర్.ప్రియ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమారగురుబరన్ తదితరులు పాల్గొన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల సంచారం రోజురోజుకూ అధికమవుతోందని, నగరంలోను, సబర్బన్ ప్రాంతాల్లోనూ ఆ వాహనాలకు ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని 104వ వార్డు డీఎంకే కార్పొరేటర్ కోరారు. దీనిపై మేయర్ మాట్లాడుతూ 15 జోనన్ల జోన్‌కు ఒకటి చొప్పున ఈవీ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, తొలివిడతగా మెరీనాబీచ్, బీసెంట్‌నగర్ బీచ్ సహా 9 ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. మెరీనాబీచ్‌లో రోప్‌కార్ నిర్మాణ ప్రాజెక్టు ఏ దశలో ఉందని డీఎంకే కార్పొరేటర్ సెమ్మొళి ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో రోప్‌కార్ ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలపై పరిశీలిస్తున్నారని, వాటికి సంబంధించి నివేదికలు రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని మేయర్ సమాధాన మిచ్చారు, నగరంలో రహదారుల్లో ఉన్న దుకాణాలను క్రమబద్ధీకరించడంలో భాగంగా 15 జోన్లలో నగర విక్రయ కమిటీలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో నగరంలోని కాయిధేమిల్లత్ మహిళా కళాశాల ప్రాంగణంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలని నిర్ణయించారు.

కోవై, నీలగిరి జిల్లాలకు రెడ్ అలర్ట్



ఉధృతంగా ప్రవహిస్తున్న భవానీ వాగు

చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావం, బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం కారణంగా కోయంబత్తూరు, నీలగిరి జిల్లాలకు స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం రెండు రోజులపాటు రెడ్ అలెర్ట్ ప్రకటించింది. గురు, శుక్రవారాల్లో నీలగిరి, కోయంబత్తూరు జిల్లాలోని కొన్ని కొండ ప్రాంతాల్లోనూ భారీ నుండి ఓ మోస్తరుగా, తిరునల్వేలి జిల్లాలోని కొండ ప్రాంతాల్లోనూ, తేని, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాల్లో కొన్ని చోట్ల చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయన్నారు. బుధవారం నీలగిరి, కోయంబత్తూరు, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయని తెలిపారు. పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం చెదురుమదురుగా వర్షాలు కురిశాయన్నారు. గురువారం కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లో గంటలకు 40 నుండి 50 కి.మీల వేగంతో పెనుగాలులతో వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. తేని, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాల్లో పలు చోట్ల భారీగా వర్షాలు కురుస్తాయన్నారు. ఈ నెల 31 నుండి జూన్ 3 వరకు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లోనూ, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయి. చెన్నై, సబర్బన్ ప్రాంతాల్లో వచ్చే రెండు రోజుల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ పరిశోధన కేంద్రం పేర్కొంది. సముద్రతీర ప్రాంతాల్లో గంటకు 50 నుండి 55 కి.మీ వేగంతో పెనుగాలులు వీస్తాయన్నారు. ఈ నెలాఖరువరకు జాలర్లు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని కూడా హెచ్చరికలు జారీ అయ్యాయి.

డీఎంకేని ఓడిద్దాం... మా కూటమిలోకి రండి!

• విజయ్‌కి బీజేపీ నేత నయినార్ పిలుపు



చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో అవినీతి డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించడమే తమిళగ వెట్రికళగం (టీవీకే), బీజేపీ ప్రధాన లక్ష్యం కనుక టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎన్డీయే కూటమిలోకి రావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పిలుపునిచ్చారు. మదురైలో బుధవారం ఉదయం ఆయన మురుగ భక్తుల మహానాడు ఏర్పాట్లను పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ టీవీకే నేత విజయ్ పార్టీ ప్రారంభసమయంలో బీజేపీపై విమర్శలు చేశారని, అయితే తన రాజకీయ బద్ధశత్రువు డీఎంకే అని కుండబద్దలు కొట్టినట్లు ప్రకటించారని తెలిపారు. ఇటు బీజేపీ, అటూ టీవీకే ఏకైక లక్ష్యం డీఎంకే ప్రభుత్వానికి చరమగీతం పాడటమేనని స్పష్టమవుతోందన్నారు. రెండు పార్టీల ప్రధాన లక్ష్యం ఒక్కటే అయినప్పుడు ఒకే కూటమిలో చేరి ఆ లక్ష్యాన్ని సాధించవచ్చని, ఆ దిశగా విజయ్‌ని ఎన్డీయేలోకి ఆహ్వానిస్తున్నామని చెప్పారు. పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో వేల్ యాత్ర జరుపనున్నామని చెప్పారు. బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై పాదయాత్ర, శాసనసభ్యుల పాదయాత్ర ఇలా పలు ముమ్మర ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నామని నయినార్ నాగేంద్రన్ తెలిపారు.

సమాచార దర్శిని

ఫైన్ ఆర్ట్స్ కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తరమణిలోని ప్రభుత్వ ఎంజీఆర్ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ అందిస్తున్న కోర్సుల్లో దరఖాస్తు గడువు జూన్ 4వ తేది వరకు పొడిగించారు. 2025-25వ విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్ విభాగంలో సినిమాటోగ్రఫీ, డిజిటల్ ఇంటర్మీడియాక్ట్, ఆడియోగ్రఫీ, డైరెక్షన్ అండ్ స్క్రీన్‌ప్లే రైటింగ్, ఫిల్మ్ ఎడిటింగ్, యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ తతదితర కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు www.filminstitute.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 4వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలని శిక్షణా కేంద్రం ఒక ప్రకటనలో తెలియజేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కుండ్రత్తూర్: నడైపాదై వీధి, దర్బార్ వీధి, కన్నియప్పన్ నగర్, పొన్నియమ్మన్ నగర్, తిరువళ్లువర్ వీధి, చిన్న వీధి, పెద్ద వీధి, నవీధార్ వీధి, దురైస్వామి ముదలియార్ వీధి, లక్ష్మీ నగర్, మహాలింగ నగర్

తిరువేర్కాడు: కో-ఆపరేటివ్ నగర్, గజేంద్రన్ వీధి, మాదిరావేడు, కావేరి నగర్, వేలప్పన్‌చావిడి పీహెచ్ రోడ్డు

జేజే నగర్: అంబేడ్కర్ నగర్, 17,18 క్రాస్ వీధులు, 9వ మెయిన్ రోడ్డు, ఎస్బీఐ ఓఏ స్కూల్ 6వ మెయిన్ రోడ్డు, ఏరి స్కీమ్ 2వ మెయిన్ రోడ్డు, వినోద్ అపార్ట్‌మెంట్స్, గంగైఅమ్మన్ నగర్, అపూర్వ అపార్ట్‌మెంట్స్, గోల్డన్ హోమ్స్, జెమ్స్ పార్క్

ఆవడి: తిరుమలైవాసన్ నగర్, అశోక్ నగర్, పూంపుళిల్ నగర్, కన్నడ పాళయం, తిరుముల్లైవాయల్ రోడ్డు, రామకృష్ణ నగర్, భారతి నగర్

పుదుతాంగల్: పెరియార్ నగర్, దేవరాజ్‌పిళ్లై వీధి, వీజీఎస్, నిత్యానందం నగర్, పెరుమాళ్ ఆలయ వీధి, జీఎస్టీ రోడ్డు కొంత భాగం, ఇరుంబులియూర్ సర్వీస్ రోడ్డు

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం, వారాంతపు సెలవు రోజుల సందర్భంగా 2,510 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) తెలిపింది. ఆ ప్రకారం, కిలాంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోవై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈ నెల 30వ తేది 570 బస్సులు, 31న 605 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఈ నెల 30న 100, 31న 90 బస్సులు, మాధవరం నుంచి 30, 31 తేదీల్లో తలా 24 బస్సులు నడుపనున్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోవై తదితర నగరాల నుంచి ఇతర ప్రాంతాలకు 250 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

దర్శనం, ప్రసాద ఛార్జీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందూ దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో వసూలుచేస్తున్న దర్శనం, ప్రసాద ఛార్జీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు కల్పించారు. వాణిజ్యపరమైన సంస్థల వార్షికాదాయం రూ.40 లక్షలకు పైగా, సేవలందిస్తున్న సంస్థలు రూ.20 లక్షలకు పైగా వార్షికాదాయం ఉంటే జీఎస్టీ నెంబరు పొందాల్సి ఉంది. దేవాదాయ శాఖ ఆధీనంలోని మదురై తదితర ఆలయాలు జీఎస్టీ నెంబరు పొందాయి. ఆలయ ఆదాయం గణించి, అందుకు తగినట్లు పన్ను చెల్లించాలని సూచించారు. ఆ ప్రకారం, ఆలయానికి చెందిన భవనాలు, మండపాలు నుంచి లభించే అద్దెకు 12 నుంచి 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, వాహన పార్కింగ్ ఫీజు, టెండర్, వేలం ద్వారా ప్రసాదం విక్రయం, ఆలయం ద్వారా విక్రయించే ఇతర వస్తువులపై 18 శాతం జీఎస్టీ విధించారు. అదే సయమంలో, ఆలయం తరపున నేరుగా ప్రసాదం విక్రయం, తల వెంట్రుకలు తీయడం, వెంట్రుకల విక్రయాలు, దర్శనం, ప్రత్యేక దర్శనం తదితర వాటిని జీఎస్టీ నుంచి మినహాయింపు కల్పించినట్లు అధికారులు తెలిపారు.

రేపు డీఎంకే ధర్నా

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): నగల రుణాలపై రిజర్వ్ బ్యాంక్ విధించిన కొత్త నిబంధనలు ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం (ఈ నెల 30వ తేది) డీఎంకే రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేది తంజావూరు ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ సంఘం కార్యదర్శి ఏకేఎస్ విజయన్ విడుదల చేసిన ప్రకటనలో... రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం అధికంగా నగలపై రుణాలు తీసుకుంటారన్నారు. అలాగే, పేద, మధ్యతరగతి ప్రజలు కూడా నగల రుణాలు తీసుకుంటారన్నారు. తాజాగా, రిజర్వ్ బ్యాంక్ పరిచయం చేసిన కొత్త నిబంధనలతో రైతులు, సామాన్య ప్రజలు రుణాలు తీసుకోలేని పరిస్థితి నెలకొందని, కొత్త నిబంధనలు సత్వరం ఉపసహరించుకోవాలన డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టనున్నట్లు విజయన్ తెలిపారు.

పుదుచ్చేరిలో మద్యం ధర పెంపు

ప్యారీస్, మే 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో మద్యంపై పెంచిన ధరలు బుధవారం నుండి అమలులోకి వచ్చింది. బీరుకు రూ.10, క్వార్టర్ బాటిల్ రూ.6 నుండి రూ.30 వరకు ధర పెంచుతూ ఆ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. పుదుచ్చేరి రాష్ట్ర అసెంబ్లీలో మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశాలో ముఖ్యమంత్రి రంగస్వామి పలు సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఈ పథకాలను విజయవంతంగా నిర్వహించాలంటే ప్రభుత్వానికి అదనంగా రూ.500 కోట్లు అవసరమని, ఆ స్థాయి నిధులు ప్రభుత్వ ఖజానాలో లేనందునప్రభుత్వ ఆదాయం పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రంగస్వామి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఆ రాష్ట్రప్రజలపై ఆర్థిక భారం మోపకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే దిశగా మద్యం ధరలను పెంచాలని నిర్ణయించారు. ఆ మేరకు మద్యంపై ఎక్సైజ్ సుంకం, దుకాణాలకు లైసెన్స్ ఫీజు పెంచాలని నిర్ణయిచారు. రెండు నెలల అనంతరం మద్యం ధరలను పెంచుతూ బుధవారం విడుదల చేసిన జీవో వెంటనే అమలుకు వచ్చింది. ఈ జీవో ప్రకారం క్వాంటిటీని బట్టి ఒక్కో మద్యం సీసాకు రూ.6 నుండి రూ.120 వరకు ధర పెంచారు. అదేవిధంగా బీరు



సీసాపై రూ.5 నుండి రూ.10 వరకు పెంచిన ధర వెంటనే అమలుకు వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. 750 మి.లీ. ఫుల్‌బాటిల్‌కు బ్రాండును బట్టి రూ.24 నుండి రూ.120 వరకు ధర పెంచడంపై మందుబాబు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అన్నాడీఎంకే ఎమ్మెల్యే విజయంపై పిటిషన్

● తోసిపుచ్చిన మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, మే 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి అన్నాడీఎంకే ఎమ్మెల్యే అశోక్‌కుమార్ గెలుపును సవాలు చేస్తూ డీఎంకే అభ్యర్థి సెంగుట్టువన్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. 2021లో అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కృష్ణగిరి నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరుఫున పోటీచేసిన అశోక్ కుమార్ 794 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆయన గెలుపు చెల్లదని ప్రకటించాలని కోరుతూ ఆ నియోజకవర్గంలో పోటీ చేసిన డీఎంకే అభ్యర్థి సెంగుట్టువన్ మద్రాస్ హైకోర్టులో కేసు వేశారు. అందులో ఓటర్లకు నగదు పంపిణీ చేశారని, ప్రభుత్వ యంత్రాంగాన్ని తమ ప్రచారానికి వినియోగించి అశోక్‌కుమార్ గెలుపొందారని, నామినేషన్ పత్రాల్లో ఆస్తులకు సంబంధించిన వివరాలు దాచారని, ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించలేదని సెంగుట్టువన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో, తనకు వ్యతిరేకంగా దాఖలైన కేసులో చూపిన ఆరోపణలు అవాస్తవమని అన్నా డీఎంకే ఎమ్మెల్యే అశోక్‌కుమార్ న్యాయస్థానానికి వివరించారు. ఇరు తరుపు వాదనల అనంతరం న్యాయస్థానం సెంగుట్టువన్ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

చైనా కార్గో విమానానికి బాంబు బెదిరింపు

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ముంబై వెళ్లబోయి చెన్నై నగరానికి వచ్చిన చైనా కార్గో విమానానికి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో, కార్గో ప్రాంతంలో సీఐఎస్ఎఫ్ బలగాలు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డాగ్ స్క్వాడ్‌తో విమానంలో తనిఖీలు చేపట్టి, ఎలాంటి పేలుడు పదార్థం లేదని నిర్ధారించారు. ముంబై విమానాశ్రయానికి రానున్న చైనా సరుకుల విమానంలో శక్తివంతమైన పేలుడు పదార్థం ఉంచినట్లు మంగళవారం ఉదయం ముంబై విమానాశ్రయానికి గుర్తుతెలియని చిరునామాతో ఈ-మెయిల్ వచ్చింది. ఆ విమానం చైనా దేశం షాంఘాయ్ నుంచి వస్తున్నట్లు ముంబై విమానాశ్రయ అధికారులకు తెలిసింది. దీంతో, విమానంలో తనిఖీలు చేపట్టేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో, చైనా సరుకుల విమానం ముంబై బదులు చెన్నై విమానాశ్రయం చేరుకున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో, ఆ విమానంలో తనిఖీలు చేపట్టేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అధికారులు, అందులో ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. సాధారణంగా ప్రయాణికుల విమానాలకు బాంబు బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో, చైనా సరుకుల విమానానికి బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. ఒకవైపు చైనా సరుకుల విమానంలో తనిఖీలు చేపడుతుండగా, మరోవైపు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణికులు తమ తమ విమానాల్లో యధావిధిగా ప్రయాణించారు.

ద్విచక్ర వాహనాల చోరీ

● బాలుడి సహా ఇద్దరి అరెస్ట్

వేలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం ప్రాంతంలో ఇటీవల జరిగిన గంగమ్మ జాతర వేడుకల్లో ద్విచక్రవాహనాల చోరీ వ్యవహారంలో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే గంగమ్మ ఊరేగింపు ఉత్సవానికి వచ్చిన భక్తులు తాము పార్క్‌చేసిన ద్విచక్రవాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారంటూ గుడియాత్తం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, అక్కడి సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులకు కాట్పాడికి చెందిన వెంకటేశన్, ఓ బాలుడు ఈ దొంగతనాలకు పాల్పడ్డారని నిర్ధారణ కావడంతో నిఘా వేసిన పోలీసులు ఆ ఇద్దరిని అరెస్టు చేశారు. వీరినుండి గుడియాత్తం సహా కాట్పాడి, కేవీకుప్పం తదితర ప్రాంతాల నుండి దొంగిలించిన 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల మృతి

ప్యారీస్, మే 28 (ఆంధ్రజ్యోతి): తేని సమీపంలోని ఉత్తమపాళయం బైపాస్ రోడ్డులో బుధవారం ఉదయం రోడ్డు పక్కన వున్న గోతిలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో తల్లీకొడుకులు మృతిచెందగా, మరో ఐదుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మదురైలో పోలీస్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న వెల్లపాండి కుమార్తె అపర్ణ(22) అనారోగ్యానికి గురవడంతో ఆమెకు సేలంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. చికిత్స అనంతరం వెల్లపాండి భార్య జయ (45), కుమారుడు గౌతమ్ (25) ఉత్తమపాళయంలోవున్న బంధువుల ఇంటికి కారులో వెళ్ళారు. ఆ కారును జయ బంధువు అరుణ్ నడుపగా, అరుణ్ తల్లి జయలక్ష్మి (50) కూడా ఆ కారులో ప్రయాణం చేశారు. వారు ఉత్తమపాళయం బైపాస్ రోడ్డులో వెళ్తున్న సమయంలో కారు టైరు హఠాత్తుగా పేలి అదుపుతప్పి రోడ్డు పక్కనవున్న గోతిలోకి దూసుకెళ్ళింది. ప్రమాదంలో జయ, ఆమె కుమారుడు గౌతమ్ అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలిసి ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో తేనిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



చెట్టును ఢీకొన్న ఆటో

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి సమీపంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. షేనాయ్ నగర్‌కు చెందిన వెంకటాచలపతి, విజయకుమార్, అనుప్రియ, కయంతిక, శశికళ, నుంగంబాక్కం పుష్పానగర్‌కు చెందిన పాండురంగన్ మంగళవారం తిరుచెందూర్ ఆలయాన్ని దర్శించుకున్నారు. అక్కడి నుంచి కులశేఖరపట్టణం ముత్తారమ్మన్ ఆలయానికి ఓ ఆటోలో బయల్దేరారు. కులసై ఎంజీఆర్ నగర్ ప్రాంతంలో ఆటో హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న వేప చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో విజయకుమార్, అనుప్రియ, కయంతిక తదితరులకు స్వల్ప గాయాలు, పాండురంగన్, శశికళకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అండాలో పడి రెండేళ్ల బాలిక మృతి

వాషర్‌మెన్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): నీరు నింపిన అండాలో పడి రెండేళ్ల బాలిక మృతిచెందిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఆర్కే పేట పంచాయతీ యూనియన్ ఎస్ఎస్ఆర్ కండిగై గ్రామానికి చెందిన ముత్తు కుమార్తె నిత్య (2) మంగళవారం మామిడి కాయ తిని చేతులు శుభ్రం చేసుకునేందుకు స్టీల్ అండా దగ్గరకు వెళ్లి కాలు జారి పడి నీట మునిగింది. తల్లిదండ్రులు ఆమెను వెంటనే వంగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా, అప్పటికే బాలిక మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆర్కే పేట పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

స్టాక్ మార్కెట్లో నిధుల సేకరణకు కార్పొరేషన్లకు అనుమతి

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): కోవై, తిరుచ్చి, తిరుప్పూర్ కార్పొరేషన్లలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు స్టాక్ మార్కెట్లో నిధులు సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. కార్పొరేషన్ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి తదితరాలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు అందించేందుకు సాధ్యం కావడం లేదు. దీంతో, ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్, నాబార్డు బ్యాంక్, జర్మన్ బ్యాంక్ తదితర విదేశీ ఫైనాన్స్ సంస్థల నుంచి రుణాలు పొంది మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆ రుణాలకు ఏడాదికి 8.75 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో, స్టాక్ మార్కెట్ ద్వారా నిధులు సేకరించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పరిచయం చేసింది. ఆ ప్రకారం, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఇండోర్, పూనే, వారణాసి తదితర కార్పొరేషన్ల ద్వారా అర్బన్ ఫైనాన్స్ బాండ్లు జారీచేసి, ఒక్కొక్కటి రూ.100 కోట్లకు తక్కువగా నిధులు సేకరిస్తున్నాయి. రాష్ట్రంలో మొదటిగా చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఫైనాన్స్ బాండ్ల ద్వారా రూ.200 కోట్లు సేకరించాలని నిర్ణయించారు. ఈ నిధులకు ఏడాదికి 7.97శాతం వడ్డీ చెల్లించాల్సిఉంటుంది.ఈ క్రమంలో, కోవై, తిరుప్పూర్, తిరుచ్చి కార్పొరేషన్లు స్టాక్‌మార్కెట్లో నిధులు పొందేందుకు ప్రభుత్వం అనుమతులు జారీచేసింది.

2 నుంచి ఆర్ట్స్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

● 30 నుంచి మళ్లీ దరఖాస్తు చేసేందుకు అవకాశం

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలల్లో అడ్మిషన్లకు సంబంధించి జూన్ 2వ తేది నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 176 ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తు స్వీకరణ ఈ నెల 7న ప్రారంభమై 27వ తేదీతో ముగిసింది. ఆన్‌లైన్ ద్వారా 2,25,705 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల ర్యాంకుల జాబితా గురువారం, జనరల్ కేటగిరీ విద్యార్థుల జాబితా ఈ నెల 30వ తేది విడుదల చేయనున్నారు. ప్రత్యేక కేటగిరీ వారికి జూన్ 2 నుంచి, జనరల్ కేటగిరీలో 4వ తేది నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. జూన్ 30వ తేది నుంచి ఫస్టియర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. సకాలంలో దరఖాస్తు చేసుకోనివారు, సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం ఈ నెల 30వ తేది నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్టు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవీ చెళియన్ ఒక ప్రకటనలో తెలిపారు.

2న పాఠశాలలు పునఃప్రారంభం

● అదేరోజు పాఠ్యపుస్తకాల పంపిణీ

పెరంబూర్, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలలు జూన్ 2వ తేది ప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. అదేవిధంగా అదే రోజు అన్ని తరగతుల వారికి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొంది. 1 నుంచి 12వ తరగతి వరకు అన్నిరకాల పాఠశాలలు 2 నుంచి ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్ బదిలీ

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్ ఎం.పళనిస్వామి సహా ముగ్గురు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు. ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్ పళనిస్వామి ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఉపాధ్యాయుల ఎంపికబోర్డు సభ్యులుగా వ్యవహరిస్తున్న సి.ఉషారాణి తమిళనాడు పాఠ్యపుస్తకాలు, విద్యా కమిషన్ కార్యదర్శిగా, తమిళనాడు పాఠ్యపుస్తకాలు, విద్యా కమిషన్ కార్యదర్శి పి.కుప్పుస్వామిని ప్రైవేటు పాఠశాలల డైరెక్టర్‌గా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి పి.సుందరమోహన్ ఉత్తర్వులు జారీచేశారు.

సర్వీస్ సెంటరులో అగ్ని ప్రమాదం

అడయార్, మే 28 (ఆంధ్రజ్యోతి): తాంబరం సమీపంలో కారు సర్వీసు సెంటరులో ఉన్నట్టుండి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 9 కార్లు మంటల్లో కాలిపోయాయి. తాంబరం సమీపంలోని పాత పెరుంగళత్తూరుకు చెందిన కార్తీక్ అనే వ్యక్తి అదే ప్రాంతంలో కార్ సర్వీస్ సెంటరు నడుపుతుండగా, మంగళవారం రాత్రి షెడ్డును మూసివేసి ఇంటికి వెళ్ళారు. అయితే, బుధవారం ఉదయం సర్వీస్ సెంటరు నుంచి ఒక్కసారిగా పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక దళానికి సమాచారం చేరవేశారు. దీంతో హుటాహుటిన అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో తొమ్మిది కార్లు కాలిపోయాయి. విద్యుదాఘాతం వల్లే ఈ ప్రమాదం జరిగివుంటుందని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

నగల తాకట్టుపై ఆర్బీఐ నిబంధనలు తొలగించండి

● కేంద్ర మంత్రికి సీఎం స్టాలిన్ లేఖ

చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): బంగారు నగల తాకట్టుకు రిజర్వు బ్యాంక్ కఠిన నిబంధనలు అమలు చేయడం వల్ల రైతులు, కోళ్ల ఫారం యజమానులు, మత్స్యపరిశ్రమల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, ఆ నిబంధనలు తొలగించేలా ఉత్తర్వు జారీ చేయాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం లేఖ రాశారు. నగల తాకట్టుపై నిబంధనలు విధించడంతో రాష్ట్రంలోని రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోందని, స్వల్ప కాలిక పంటలు వేయడం కోసం రైతులు నగలను తాకట్టుపెట్టి రుణం పొందటం ఆనవాయితీ అని, అయితే నగల తాకట్టుపై కఠిన నిబంధనలు విధిస్తే తమ నగల విలువకు సరిపడా రుణం పొందలేకపోతారని ఆయన పేర్కొన్నారు. నగల తాకట్టుకు కఠిన నిబంధనలు అమలు చేయడం భావ్యమేనా అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో మంత్రి నిర్మలా సీతారామన్ జోక్యం చేసుకుని ఆర్బీఐ నిబంధనలు ఉపసంహరించుకునేలా చర్యలు చేపట్టాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

ఈపీఎస్ ఇంటికి మళ్లీ బాంబు బెదిరింపు

వాషర్‌మెన్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రీన్‌వేస్ రోడ్డులోని ఈపీఎస్ ఇంటికి బాంబు బెదిరింపు వచ్చింది. బాంబ్ స్క్వాడ్ నిపుణులు తనిఖీ చేపట్టి, బాంబు బెదిరింపు నకిలీదిగా గుర్తించారు. కొద్దిరోజుల క్రితం సేలం నెడుంజశాలై నగర్‌లోని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఇంట్లో బాంబు ఉంచినట్టు చెన్నైలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి కట్ చేశారు. ఈ సమాచారాన్ని సేలం పోలీసులకు తెలియజేయడంతో, బాంబ్ స్క్వాడ్ నిపుణులు, పోలీసు జాగిలంతో ఈపీఎస్ ఇంటికి చేరుకున్న పోలీసులు, గంట పాటు తనిఖీలు చేపట్టి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో, స్థాక గ్రీన్‌వేస్ రోడ్డులో ఉన్న ఈపీఎస్ ఇంటికి బాంబు బెదిరింపు రావడం గమనార్హం.

తిరువణ్ణామలై ఆలయ పేరు మార్చడం లేదు

● రాష్ట్ర ప్రభుత్వం వివరణ

వాషర్‌మెన్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆలయం పేరు మారుస్తున్నారనే ప్రచారం పూర్తి అవాస్తమని రాష్ట్ర సమాచార శాఖ స్పష్టం చేసింది. తిరువణ్ణామలై ఆలయాన్ని అరుణాచలేశ్వరాలయంగా మార్చనున్నట్లు ఓ వ్యక్తి మాట్లాడుతూ తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై రాష్ట్ర సమాచార శాఖ తన ఎక్స్ పేజీలో... "1940లో శైవ సిద్ధాంత మహాసమాజ్ కార్యదర్శి ఎం.బాలసుబ్రమణియన్ రచించిన 'తిరువణ్ణామలై చరిత్ర' అనే పుస్తకంలో ఈ ఆలయానికి అరుణాచలం దేవస్థానం అని పేర్కొన్నారు. పలు శతాబ్దాలుగా భక్తులు, అన్నామలైయార్ ఆలయం, అరుణాచలేశ్వరాలయం అనే పేర్లతో పిలుస్తున్నారు. ఆలయ పేరు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం" అంటూ పోస్ట్ చేశారు.

శివకాశి టపాసులకు భౌగోళిక గుర్తింపు కోరుతూ దరఖాస్తు

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శివకాశి టపాసులకు భౌగోళిక గుర్తింపు కోరుతూ తమిళనాడు కేప్ వెడి క్రాకర్ మాన్యుఫ్యాక్చర్స్ (టన్‌బామా) దరఖాస్తు చేసుకుంది. శివకాశిలో 1923లో చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, చిన్న టపాసులు మాత్రమే తయారుచేస్తుండగా ప్రస్తుతం 300 రకాలకు పెరిగాయి.. శివకాశి, విరుదునగర్, సాతూర్ ప్రాంతాల్లో సుమారు 1,080కి టపాసుల తయారీ కర్మాగారాలు పనిచేస్తుండగా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. దేశంలో తయారయ్యే మొత్తం టపాసుల్లో 90 శాతం శివకాశిలోనే తయారవుతుండా, ఏడాదికి సుమారు రూ.6,000 కోట్ల వ్యాపారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో, శివకాశి టపాసులకు భౌగోళిక గుర్తింపు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై టన్‌బామా అధ్యక్షుడు గణేశన్ మాట్లాడుతూ... శివకాశి టపాసుకు భౌగోళిక గుర్తింపు వస్తే అంతర్జాతీయ వాణిజ్యంలో చట్టపరమైన రక్షణకు ప్రాధాన్యత ఉంటుందని, దీని వల్ల ఉపాధి పెరగడంతో పాటు చైనా టపాసులను మార్కెట్లోకి రాకుండా అడ్డుకోవడంతో పాటు శివకాశి టపాసుల విక్రయాలు పెరుగుతాయని గణేశన్ తెలిపారు.

కొత్తగిరి సమీపంలో పులి సంచారం

● భయాందోళనలో గ్రామస్తులు

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): కొత్తగిరి కంబట్టి గ్రామ శివారులో పులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. నీలగిరి జిల్లా కట్టబెట్టు అటవీ ప్రాంతంలోని కంబట్టి గ్రామంలో మంగళవారం తేయాకు తోటల మీదుగా రోడ్డు పైకి వచ్చిన పులి, కొద్దిసేపు అక్కడ సంచరించి తిరిగి తోటల మీదుగా అవడిలోకి వెళ్లింది. పులి సంచారం అ ప్రాంతంలో ఏర్పాటుచేసిన సీసీ టీవీ కెమెరాల్లో నమోదైంది. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి, పులి సంచారం వాస్తవమని నిర్ధారించారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ...



జనావాస ప్రాంతంలో పులి

ఎప్పనాడు అటవీ ప్రాంతం నుంచి వచ్చిన పులి ఈ ప్రాంతంలో సంచరించి వెళ్లిందని, ఈ ప్రాంతంలో నిఘా ముమ్మరం చేశామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న అన్నాడీఎంకే నాయకులు

వేలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి మండలం గాంగేయనల్లూరులో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో ఆ గ్రామంలోని వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన డీఎంకే నేతలు అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 4వ డివిజన్ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నారాయణన్, మేఘనాథన్ తదితరులు పాల్గొన్నారు.

కాట్పాడిలో ముగిసిన జమాబందీ



వేలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి రెవెన్యూ కార్యాలయంలో గత వారం ప్రారంభమైన జమాబందీ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రజలకు ఇళ్లపట్టాలు, నూతన రేషన్‌కార్డులు, సర్టిఫికెట్లు తదితర సమస్యల గురించిన వినతిపత్రాలను కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ కలియమూర్తి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజులు నిర్వహించిన జమాబందీ కార్యక్రమంలో మొత్తం 310 వినతులు అందుకున్నామని, త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వరన్, వీఏఓలు లలిత, శివ కిషోర్, ప్రభుత్వ అధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలెక్టర్ ప్రతాప్

తిరుత్తణి, మే 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి గాంధీ రోడ్డులో ఉన్న డా.రాధాకృష్ణన్ ప్రభుత్వ పాఠశాల బాలుర హయ్యర్ సెకండరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రతాప్ బుధవారం తనిఖీ చేశారు. ఆ సమయంలో 10, 11, 12 తరగతుల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతులు పర్యవేక్షించాల్సిన ప్రధానోపాధ్యాయుడు బాలసుబ్రమణ్యంను కలెక్టర్ ప్రశ్నించారు. రాబోయే విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణతా శాతం తగ్గకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ తెలిపారు.

చెక్‌పోస్ట్‌లో రూ.1.47 లక్షల స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): కోవై మదుకరై మరప్పాలం ప్రాంతంలో ఉన్న చెక్‌పోస్ట్‌లో ఏసీబీ అధికారులు చేపట్టిన తనిఖీల్లో రూ.1.47 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సేలం-కొచ్చిన్ జాతీయ రహదారిలో ఉన్న ఈ చెక్‌పోస్ట్‌లో బుధవారం తమిళనాడు అవినీతి నిరోధక శాఖ ఇన్స్‌పెక్టర్ షీలా నేతృత్వంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో, అక్కడ విధుల్లో ఉన్న ఎంవీఐ సతీష్ జయచంద్రన్, కార్యాలయ అసిస్టెంట్ లోకనాథన్ తదితరుల నుంచి లెక్కల్లో చూపని రూ.1,47,500 స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అలాగే, ఇద్దరిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ఏసీబీ అధికారులు సిఫారసు చేశారు.

మార్కులు తగ్గాయని ప్లస్-2 విద్యార్థిని ఆత్మహత్య

వాషర్‌మెన్‌పేట, మే 28 (ఆంధ్రజ్యోతి): మార్కులు తగ్గాయంటూ ప్లస్-2 విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూత్తుకుడి జిల్లాలో చోటుచేసుకుంది. ఆళ్వార్‌తిరునగరి సమీపం ఆదినాథపురం క్రైయడియూర్ ప్రాంతానికి చెందిన రైతు షణ్ముగనాథన్-చంద్రవడివు దంపతుల కుమార్తె రాణి శ్వేత (17) నజరేత్‌లోని పాఠశాలలో ప్లస్-2 పూర్తిచేసింది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో 298 మార్కులు సాధించి ఉత్తీర్ణురాలైంది. తక్కువ మార్కులు రావడంతో డిగ్రీలో సీటు వస్తుందో? రాదో? అనే ఆవేదనతో ఈ నెల 25న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు ఆమెను వెంటనే తిరునల్వేలి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మంగళవారం రాత్రి శ్వేత మృతిచెందింది. ఆళ్వార్‌తిరునగరి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రన్‌వేపై ల్యాండింగ్‌కు వచ్చి ఒక్కసారిగా ఎగిరిన విమానం

● భయంతో వణికిన ప్రయాణికులు

అడయార్, మే 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండింగ్ అయ్యేందుకు వచ్చిన ఒక విమానం ఉన్నట్టుండి మళ్ళీ గాల్లోకి ఎగిరిపోవడంతో అందులోని ప్రయాణికులు భయంతో వణికిపోయారు. సింగపూర్ నుంచి ఎయిరిండియా విమానం ఒకటి 186 మంది ప్రయాణికులతో బుధవారం ఉదయం 10.15 గంటల సమయంలో చెన్నై ఎయిర్‌పోర్టుకు వచ్చింది. ఈ విమానం ల్యాండ్ అయ్యేందుకు రన్‌వేకు 200 అడుగుల ఎత్తువరకు వచ్చి ఒక్కసారిగా 3500 అడుగుల ఎత్తుకు వెళ్ళిపోయింది. ఆ తర్వాత విమానం గగనతలంలో దాదాపు 20 నిమిషాల పాటు చక్కర్లు కొట్టి, 10.37 నిమిషాలకు మళ్ళీ సురక్షితంగా కిందికిదిగింది.

వైగో.. ప్రజల గొంతుకగానే ఉంటారు

● దురై వైగో

అడయార్, మే 28 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో కేవలం పార్లమెంట్‌లోనే కాకుండా, బయట ప్రపంచంలోనూ ప్రజల గొంతుకగా ఉంటారని ఆ పార్టీ ముఖ్య కార్యదర్శి దురై వైగో అన్నారు. డీఎంకే కూటమిలో భాగస్వామిగా ఉన్న ఎండీఎంకేకు రాజ్యసభ సీటు ఈ సారి కేటాయించలేదు. ఇది రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ చర్చకు ఫుల్‌స్టాప్ పెట్టేలా దురై వైగో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ పార్టీ నేత వైగో కేవలం పార్లమెంట్‌లోనే కాకుండా, బయట కూడా ఎల్లవేళలా ప్రజల గొంతుకగా ఉంటారని, తాము డీఎంకే కూటమిలో కొనసాగుతామని ఆయన స్పష్టం చేశారు.

వీజీపీ విహార కేంద్రానికి పోలీసుల నోటీసు

అడయార్, మే 28 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన ఈసీఆర్, ఈంజంబాక్కంలో ఉన్న వీజీపీ గోల్డెన్ బీచ్‌కు పోలీసులు నోటీసు లిచ్చారు. ఈ విహార కేంద్రంలోని జెయింట్ వీల్‌లో మంగళవారం రాత్రి ప్రమాదం జరిగింది. పైకి వెళ్ళిన జెయింట్ వీల్ గంట సేపటి వరకు కిందకు దిగలేదు. దీనితో ఆ వీల్‌పై కూర్చున్న సుమారు 30 మంది ప్రాణభయంతో గడిపారు. అదే సమయంలో ఇద్దరు పర్యాటకులు గాయపడ్డారు. ఈ విషయంపై స్పందించిన పోలీసులు.. విహార కేంద్రంలోని భద్రతా ప్రమాణాలపై నివేదిక ఇవ్వాలని నోటీసులు జారీచేశారు. అదేసమయంలో బుధవారం ఈ విహార కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఈ విషయం తెలియని అనేక మంది పర్యాటకులు వీజీపీ గోల్డెన్ బీచ్‌కు వెళ్లి నిరుత్సాహానికి గురయ్యారు.

కష్టపడి సంపాదించిన డబ్బుతో
సినిమా తీశా

● జోవికా విజయకుమార్



తన కష్టార్జితం ద్వారా వచ్చిన డబ్బుతో చిత్రాన్ని నిర్మించానని నిర్మాత జోవిక విజయ కుమార్ అన్నారు. వనిత ప్రధాన పాత్రలో జోవిక నిర్మించిన చిత్రం 'మిసెస్ అండ్ మిస్టర్. వనిత విజయ్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రచార ఈవెంట్‌లో భాగంగా నిర్మాత జోవిక మాట్లాడుతూ, 'ఈ వేదికపై నిర్మాతగా నిలబెట్టిన దేవుడుకి, ఇందులో నటించిన నటీనటులకు ధన్యవాదాలు. బిగ్ బాస్ కార్యక్రమంలో పాల్గొనడం వల్ల మంచి గుర్తింపు వచ్చింది. ఈ సినిమా కూడా నేను శ్రమించి సంపాదించిన డబ్బుతో నిర్మించాను. మీడియాతో పాటు ప్రేక్షకులు కూడా ఆదరించాలి' అని కోరారు.

మధ్యతరగతి జీవితాన్ని ప్రతిబింబించే చిత్రం

నిర్మాత ఎస్ఆర్ ప్రభు



'మద్రాస్ మ్యాట్నీ' చిత్ర ఆడియో రిలీజ్ దృశ్యం

మధ్యతరగతి జీవితాన్ని ప్రతిబింబించే చిత్రం 'మద్రాస్ మ్యాట్నీ' అని, దీనిని దర్శకుడు చాలా అందంగా, వినోదాత్మకంగా చిత్రీకరించారని సినీ నిర్మాత ఎస్ఆర్ ప్రభు అన్నారు. డెబ్యూ డైరెక్టర్ కార్తికేయన్ మణి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కాళి వెంకట్, సత్యరాజ్, రోషిణి హరిప్రియన్, షెల్లి, విశ్వ, కలై తదితరులు నటించారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి జీవితంలో సంతోషం, కష్టం ఎక్కడ ఉన్నాయన్న ప్రశ్నతో సమాజంలోని ప్రతి ఒక్కరి జీవితాలను ప్రతిబింబించేలా వాస్తవిక కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించారు. జూన్ ఆరో తేదీ విడుదలకానుంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సమర్పణలో మద్రాస్ మోషన్ పిక్చర్స్ నిర్మించింది. ఈ చిత్రం ట్రైలర్, ఆడియో తాజాగా విడుదల చేశారు. నిర్మాత ఎస్ఆర్ ప్రభు మాట్లాడుతూ, 'మధ్య తరగతి మనిషి జీవితంలోని సంతోషం, కష్ట సుఖాలను సమాజంలోని ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా వాస్తవిక కథాంశంతో వినోదాత్మకంగా చిత్రీకరించారు. ఇందులో కాళి వెంకట్ నటన చాలా బాగుంది. ఆయన్ను హీరోగా ఓ మాస్ కమర్షియల్ సినిమా తీయాలని అనుకున్నాం. కానీ, ఈ సినిమాలో అది తీరిపోయింది' అన్నారు. కాళీ వెంకట్ మాట్లాడుతూ, 'ఈ సినిమా డిస్ట్రిబ్యూట్ చేసేందుకు ముందుకు వచ్చిన నిర్మాత ఎస్ఆర్ ప్రభుకు ధన్యవాదాలు. ఒక చిత్రంలో ప్రధాన పాత్ర చేస్తే ఆ తర్వాత సహాయ పాత్రలు చేసేందుకు నాకు అవకాశాలు రావని భయపడ్డాను. కానీ, ఈ సినిమాలోని అన్ని పాత్రలు కథకు మూలస్తంభాలన్నీ స్క్రిప్టు చదివి తెలుసుకుని, ప్రధాన పాత్రలో నటించేందుకు సమ్మతించాను' అన్నారు. దర్శకుడు కార్తికేయన్ మణి మాట్లాడుతూ, 'కోవిడ్ సమయంలో ఎంతో సమయం లభించింది. ఆ సమయంలో తమిళం ఎంత ప్రాచీనమైనదో తెలుసుకోవాలని భావించాను. ఇందుకోసం తమిళ సాహిత్యం, పురాణ గ్రంథాల్లోని కొన్ని కవితలను చదివాను. ప్రతి కవితలో మూడు లేదా నాలుగు సినిమాలు తీయగల పరమార్థం ఉంది. మనలో చాలా మందికి తమిళ చరిత్ర తెలియకపోవడం విచారకరం. మా ప్రాంతంలో ఒక కిరాణా షాపు యజమానిని 30 యేళ్ళుగా చూస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అతని షాపు మారలేదు, అతని జీవితమూ మారలేదు. ఫ్యామిలీ కోసం నిరంతరం శ్రమిస్తున్న ఒక తండ్రికి కష్టాలు ఎదురవుతాయి. అతడికి, కన్నబిడ్డల మధ్య అంతరం ఏర్పడుతుంది. తద్వారా ఆ తండ్రి ఎంత బాధకు లోనవుతాడో ఈ చిత్రంలో చూపించాం' అని వివరించారు.

'పిచ్చైకారన్' కాంబో రిపీట్



శశి, విజయ్ ఆంటోనీ తదితరులు

శశి దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ నటించిన 'పిచ్చైకారన్' చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ హిట్ కాంబినేషన్ మరోమారు రిపీట్‌కానుంది. ప్రస్తుతం విజయ్ ఆంటోనీ వరుస చిత్రాల్లో నటిస్తున్నారు. 'మార్గన్', 'శక్తి తిరుమగన్' చిత్రాలతో పాటు 'లాయర్' అనే మూవీలో నటిస్తున్నారు. 'లాయర్' చిత్రాన్ని విజయ్ ఆంటోనీ సొంతంగా నిర్మించనున్నారు. ఇదిలావుంటే, శశి దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ నటించే కొత్త చిత్రాన్ని ప్రకటించారు. అభిషేక్ ఫిల్మ్స్ పతాకంపై ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో అజయ్ దిషాన్ ఒక ప్రధాన పాత్ర పోషించనున్నారు. అలాగే, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక సాగుతోంది.

చిత్రజ్యోతి

ప్రేమకథా చిత్రం 'తమిళ్ పయ్యన్ - హిందీ పొన్ను'



'తమిళ్ పయ్యన్ - హిందీ పొన్ను'లో ఓ దృశ్యం

'కాదల్ మట్టుం వేణా' అనే చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు సమీర్ అలీఖాన్ తాజాగా తెరకెక్కించిన చిత్రం 'తమిళ్ పయ్యన్ - హిందీ పొన్ను'. సూపర్‌స్టార్ ఫిలిమ్స్ పతాకంపై సొంతంగా నిర్మించి, దర్శకత్వం వహించడంతో పాటు హీరోగా నటించారు. మాన్సీ హీరోయిన్. ఆడుకళం నరేన్, బ్రహ్మజీ, ఆలీ, సోనియా బోస్, మాలా పార్వతి, దీపికా అమిన్, ఉదయదీప్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ సినిమా గురించి దర్శక హీరో సమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ, 'రెండు వేర్వేరు నేపథ్యాలు కలిగిన హీరో, హీరోయిన్ ప్రేమలో పడతారు. వారి ప్రేమలో ఎలాంటి అడ్డంకులు ఎదురయ్యాయి. వాటిని వారు ఎలా అధిగమించి ఒక్కటయ్యారు అనే అంశాలతో పూర్తి ప్రేమ కథా చిత్రంగా రూపొందించాం. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతోంది. ఆగస్టు నెలలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

గ్రీవెన్స్‌లో వినతులను సత్వరం పరిష్కరించండి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నగర పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా గ్రీవెన్స్‌లో వచ్చిన వినతుల సత్వరం పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను కమిషనర్ అరుణ్ ఆదేశించారు. స్థానిక ఎగ్మూర్‌లోని నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. గ్రేటర్ చెన్నై నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అరుణ్, పోలీసుల సమస్యలు తెలుసుకునేలా ప్రతి మంగళవారం, ప్రజల సమస్యలు తెలుసుకునేలా ప్రతి బుధవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ గ్రీవెన్స్‌లో కమిషనర్ అరుణ్ స్వయంగా పాల్గొని పోలీసు అధికారులు, మహిళా పోలీసులు, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తుంటారు. ఈ నేపథ్యంలో, బుధవారం జరిగిన ప్రజా గ్రీవెన్స్‌లో 27 వినతిపత్రాలను కమిషనర్, స్వీకరించారు.

రామేశ్వరం ఆలయ హుండీ ఆదాయం రూ.1.44 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం రంగనాథస్వామి ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు రూ.1.44 కోట్లను స్వామివారిని కానుకలుగా అందజేశారు. ప్రతి 30 రోజులకు ఆలయ హుండీలు లెక్కిస్తుంటారు. ఆ ప్రకారం, మంగళవారం ఆలయ జాయింట్ కమిషనర్ చెల్లదురై నేతృత్వంలో లెక్కింపు ప్రారంభించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.1,44,62,291 నగదు, 55 గ్రాముల బంగారం, 2.900 కిలోల వెండి తదితరాలను కానుకలుగా సమర్పించారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.3.37 కోట్లతో ఆదిమూల పెరుమాళ్ ఆలయ జీర్ణోద్ధరణ



వడపళని ఆదిమూల పెరుమాళ్ ఆలయ జీర్ణోద్ధరణ పనులను ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని ఆదిమూల పెరుమాళ్ ఆలయ జీర్ణోద్ధరణ పనులను దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు బుధవారం ప్రారంభించారు. వందేళ్ల చరిత్ర కలిగిన వడపళని ఆదిమూల పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం 1960లో జరిగింది. ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టి కుంభాభిషేకం నిర్వహించాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. సీజీఎఫ్ నుంచి రూ.1.84 కోట్లు, వడపళని ఆండవర్ ఆలయ నిధుల నుంచి రూ.1.53 కోట్లు మొత్తం రూ.3.37 కోట్లు కేటాయించారు. మూల విరాట్టు సన్నిధి, అమ్మవారి సన్నిధి ముందు రాతి మండపం ఏర్పాటు, ఆలయం మూడువైపులా ప్రవేశద్వారాల ఏర్పాటు, అలంకార మండపం, వాహన మండపం, యాగశాల ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నారు. ఈ పనులను బుధవారం మంత్రి శేఖర్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో టి.నగర్ ఎమ్మెల్యే జె.కరుణానిధి, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ పళని, ఆలయ తక్కర్ ఆదిమూలం, డిప్యూటీ కమిషనర్ ముల్లై, కార్పొరేషన్ మండల కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, ఆలయ జాయింట్ కమిషనర్ హరిహరన్, కౌన్సిలర్ ఏలుమలై అధికారులు పాల్గొన్నారు.

ఐవైఏ కార్యదర్శిగా సురేష్ కొచ్చర్



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

అడయార్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ యూత్ అసోసియేషన్ (ఐవైఏ) 60వ కార్యదర్శిగా అనితా సురేష్ కొచ్చర్ నియమితులయ్యారు. ఈ సంస్థ చరిత్రలోనే ఒక మహిళ కార్యదర్శిగా ఎంపిక కావడం ఇదే తొలిసారి. అలాగే అధ్యక్షుడిగా ఉత్తమ్ కంకారియా ఎన్నికయ్యారు. ఎగ్మోర్, మాంటియత్ రోడ్డులో ఉన్న ఈ అసోసియేషన్‌ను 1965లో స్థాపించారు. రాజస్థాన్ నుంచి వలస వచ్చిన వారంతా కలిసి సమాజసేవ కోసం ఈ సంస్థను ప్రారంభించారు.. ఈ సంస్థకు కొత్తగా ఎన్నికైన ఆఫీస్ బేరర్లతో తమిళనాడు స్టేట్ మైనారిటీస్ కమిషన్ సభ్యుడు ప్రవీణ్ కుమార్ తాతియా ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే, సంస్థ కోశాధికారిగా జె.దిలీప్ బకోడియా, ట్రస్టీ ట్రెజరర్‌గా డి.లలిత్ కుమార్ బాగ్మర్ ఎంపికయ్యారు.

యుగపురుషుడు ఎన్టీఆర్

తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం నివాళి



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం నిర్వాహకులు

ప్యారీస్, మే 28 (ఆంధ్రజ్యోతి): విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా నగరంలోని తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం సభ్యులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెరంబూరు తెలుగు సాహితీ సమితి కార్యదర్శి డాక్టర్ టీఆర్ఎస్ శర్మ మాట్లాడుతూ, తెలుగునాట సంఖ్యాబలంలేని ప్రతిపక్షం, సమర్థవంతమైన రాష్ట్ర ప్రభుత్వం లేని సమయంలో తెలుగు దేశం పార్టీ ప్రారంభించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటేలా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని నెలకొల్పిన మహాపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అనంతరం వంజరపు శివయ్య మాట్లాడుతూ, ఎందరో మహానుభావులు.. వారిలో ఎన్టీఆర్ ప్రసిద్ధిచెందారని, క్రమశిక్షణ, కృషి, పట్టుదలలే ఆయన ఎదుగుదలకు కారణాలని తెలిపారు. ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు జరుపుకుంటున్నందుకు మహదానందంగా ఉందని తమ్మినేని బాబు తెలిపారు. అసమాన నటుడు అందరికీ అభిమాన పాత్రుడు నందమూరి తారకరామారావును స్మరించుకోవడం భాగ్యంగా భావిస్తున్నానని జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య తెలిపారు. చివరగా సంస్థ నిర్వాహకులంతా ఎన్టీఆర్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు.



చెన్నై అన్నాఅరివాలయంలో తనను రెండోసారి రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను, మంత్రి శేఖర్ బాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఎంపీ పి.విల్సన్, ఆయన తనయుడు రిచర్డ్‌సన్ విల్సన్

త్వరలో 'అవ్వై' స్మారక మండపం ప్రారంభం



స్మారక మందిరంలో ఉంచిన విగ్రహం

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మదురై తిరుప్పరంకుండ్రం కొండ వెనుక వైపు ఉన్న ఆలయ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మందిరంలో ఒకే రాతితో ఆరున్నర అడుగులతో ఏనుగు విగ్రహం ఏర్పాటు చేశారు. తిరుప్పరంకుండ్రం సుబ్రమణ్యస్వామి ఆలయంలో 33 ఏళ్లుగా భక్తులను ఆశీర్వదించిన ఏనుగు 'అవ్వై' 2012లో మృతిచెందింది. ఆ ఏనుగును కొండ వెనుక భాగంలో ఖననం చేశారు. మృతిచెందిన ఏనుగుకు ఆలయం తరఫున రూ.49.50 లక్షలతో స్మారక మందిరం ఏర్పాటుచేయాలని నిర్ణయించి పనులు ప్రారంభించారు. ఈ మండపంలో ప్రతిష్ఠించేందుకు ఏనుగు అవ్వై రాతి విగ్రహం తిరుప్పూర్‌లో రూపుదిద్దుకుంది. ఆరున్నర అడుగుల ఎత్తు, ఎనిమిది అడుగుల పొడవు ఉన్న ఈ విగ్రహం మంగళవారం తిరుప్పరంగుండ్రంకు తీసుకొచ్చి స్మారక మందిరంలో ఉంచారు. పనులు పూర్తిచేసి త్వరలో స్మారక మందిరం ప్రారంభిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

జీటి రోడ్డులో ఏడు చోట్ల హై లెవల్ ఫుట్‌పాత్ వంతెనలు



వండలూరు సమీపంలో ఏర్పాటవుతున్న పాదచారుల వంతెన

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు నుంచి చెంగల్పట్టు మధ్య జీటి రోడ్డులో ఏడు ప్రాంతాల్లో హై లెవల్ పాదచారుల వంతెనలు ఆగస్టులో అందుబాటులోకి రానున్నాయి. వండలూరు నుంచి సింగపెరుమాళ్ ఆలయ వరకు 18 కి.మీ మేర జాతీయ రహదారి ఉంది. ఈ రహదారిని దాటేందుకు తగిన సదుపాయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సమయాల్లో రోడ్డు దాటే సమయంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలనికి గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్య పరిష్కరించేలా జాతీయ రహదారుల శాఖ రూ.13.59 కోట్లతో ఏడు ప్రాంతాల్లో హై లెవల్ పాదచారుల వంతెనల నిర్మాణ 2024లో చేపట్టింది. ఆ ప్రకారం, వండలూరు ఇరణియమ్మన్ ఆలయం, వండలూరు రైల్వేస్టేషన్, కిలాంబాక్కం టెక్ పార్క్, వన్నియమ్మాళ్ ఇంజనీరింగ్ కళాశాల, కాటాన్‌కొళత్తూర్ జంక్షన్, మరమలై నగర్ జంక్షన్, సింగపెరుమాళ్ ఆలయ రైల్వేస్టేషన్ తదితర ఏడు ప్రాంతాల్లో చేపట్టిన వంతెన నిర్మాణాలు ముగిసి, వచ్చే ఆగస్టులో ప్రజల అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.



చేపలరేవు ప్రారంభోత్సవానికి తిరువొత్తియూరు వెళ్లగా, తనను చూసేందుకు గుమికూడిన జనంతో కరచాలనం చేస్తున్న సీఎం స్టాలిన్



రాజ్‌భవన్‌లో బుధవారం జరిగిన సిక్కిం, గోవా రాష్ట్రాల ఆవిర్భావ దినం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనను ప్రముఖులు, ఉన్నతాధికారులతో కలిసి తిలకిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

సరిహద్దు పోరాట యోధుడు వినాయగమ్‌కు ఘననివాళి



వినాయగమ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో తిరుత్తణి కలపాలని కోరుతూ పోరాడిన కె.వినాయగం 111వ జయంతి ఘనంగా నిర్వహించారు. పసుమై తాయగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, వినాయగం చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తమిళ వైద్యుల సంఘం అధ్యక్షులు డా.టి.వేలాయుధం, వీజే పాండియన్, పారిశ్రామికవేత్త బలరామన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కె.పొన్మలై, ఎన్.కన్నన్, కె.రాజేశ్వరన్‌లు పర్యవేక్షించారు.

పర్యాటకుల కోసం టూరిస్ట్ కార్డులు



వివరాలను వెల్లడిస్తున్న ప్రతినిధి

ప్యారీస్, మే 28 (ఆంధ్రజ్యోతి): మాస్కో పర్యటనకు వెళ్ళే భారతీయ పర్యాటకుల కోసం కటింగ్-ఎడ్జ్ టూరిస్ట్ సెంటర్‌లో నగదు రహిత చెల్లింపులకు టూరిస్ట్ కార్డులను అందజేస్తున్నటు ఆళ్వార్‌పేటలోని రష్యన్ కల్చరల్ సెంటర్ అధికారులు తెలిపారు. మాస్కో టూరిజం నేతృత్వంలో రష్యాలోని పర్యాటక వివరాలు, పర్యాటకులకు అందజేసే సౌకర్యాలు, టూరిస్ట్ కార్డుల గురించి ఈ కేంద్రం అధికారులు మీడియా సమావేశంలో వివరించారు. టూరిస్టుల సౌకర్యార్థం రష్యాలోవున్న బ్యాంకింగ్ కార్యాలయాల్లో పంపిణీ చేసే టూరిస్ట్ కార్డుల వివరాలతో కూడిన జాబితా ఆవిష్కరించారు. భారతీయ పర్యాటకులు నగదు రహిత చెల్లింపులు చేయడానికి కల్పించిన సౌకర్యాల గురించి ప్రతినిధులు వివరించారు.

క్రికెట్ పోటీలకు ఆహ్వానం



జీవీ సంపత్

వేలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రికెట్ సంఘం, వేలూరు నరువి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీ నుంచి విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు నరువి ఆస్పత్రి అధ్యక్షుడు జీవీ సంపత్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 1వ తేదీ ఉదయం 9 గంటలకు వేలూరులోని రాజేశ్వరి ఆవరణంలోని మైదానంలో టోర్నమెంటు జరుగుతుందన్నారు. ఈ క్రికెట్ పోటీలో పాల్గొనేందుకు 14ఏళ్ళ లోపు ఆసక్తివున్న విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7010594657 నెంబర్‌కు సంప్రదించవచ్చునని తెలిపారు.

'కలైంజర్ పేనా' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో బుధవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో తిరువారూరు జిల్లాకు చెందిన ప్రొఫెసర్ రాజగోపాలన్ రచించిన 'కలైంజర్ పేనా' (కలైంజర్ కలం) గ్రంథాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆవిష్కరించారు. ప్రొఫెసర్ రాజగోపాలన్ దివంగత మురసొలి సెల్వం ఒకే స్కూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. రాజగోపాలన్ డీఎంకేలో చేరి పార్టీకి సంబంధించిన రచనలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ప్రశంసలందుకున్నారు. ఆ నేపథ్యంలో కరుణానిధి జీవితంలోని ఆసక్తికరమైన సంఘటనలతో ఈ గ్రంథాన్ని రచించారు. ఈ కార్యక్రమంలో హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ఎంపీ ఎస్.జగద్రక్షగన్, ఎమ్మెల్యే అన్నియూరు శివా, హిందూ దేవాదాయ శాఖ సలహామండలి సభ్యుడు సుకి శివం తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ ఆకలి దినం సందర్భంగా పెరంబూరు ఎంఆర్ నగర్ ప్రాంతంలో తమిళగ వెట్రి కళగం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్


హుండీ లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.72 కోట్లు

శ్రీకాళహస్తి, మే 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,72,70,504 వచ్చింది. బుధవారం ఆలయంలో హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 73.200 గ్రాములు, వెండి 607.100 కిలోలు, విదేశీ కరెన్సీ 92 వచ్చింది. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకు సహకారం అందించాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 28(ఆంధ్రజ్యోతి): మామిడి జ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకు అధికారులు అన్ని విధాలుగా సహకారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకు అధికారులతో వర్చువల్ విధానంలో ఆయన సమీక్షించారు. మామిడిజ్యూస్ పరిశ్రమ యజమానులకు బ్యాంకువారు మంజూరు చేసిన రుణాలను రీషెడ్యూల్ చేసి వారికి సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజరు రవికుమార్, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,597
తలనీలాలు సమర్పించినవారు: 30,803



ఐదు పర్యాటక కేంద్రాల్లో యోగా ప్రచారం

● నేడు ఎస్వీ జూపార్కులో ప్రారంభం

తిరుపతి, మే 28 (ఆంధ్రజ్యోతి): జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజల్లో యోగాపట్ల అవగాహన పెంచేందుకు ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. పది లక్షల మందికి అవగాహన కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పర్యాటక శాఖ ద్వారా జిల్లాలో ఐదు పర్యాటక కేంద్రాల్లో యోగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. అందులో భాగంగా గురువారం ఉదయం తిరుపతి ఎస్వీ జూపార్కులో మొదటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 4న చంద్రగిరి కోటలో, 11న శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో, 17న శ్రీకాళహస్తిలో, 19న తిరుమల ఆస్థాన మండపంలో ఈ తరహా ప్రచార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అటు పర్యాటకాన్ని, ఇటు యోగాను ప్రచారం చేసేలా ఈ కార్యక్రమాలు రూపొందించామని వివరించారు. ఇప్పటికే ఇంటింటి సర్వేతో ఆసక్తి ఉన్నవారి పేర్లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో వివిధ శాఖలతో పాటు టీటీడీ, ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నట్లు వివరించారు.

15న తిరుమలలో స్టేట్ ఈవెంట్

తిరుమలలో జూన్ 15వ తేదీన స్టేట్ లెవల్ ఈవెంట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రతి జిల్లాలో రాష్ట్ర స్థాయి ఈవెంట్‌ను.. ఒక్కో ప్రత్యేక వర్గంతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా జిల్లాలో క్రీడా, సినిమా, సంగీత, సేవా రంగాలలోని ప్రముఖులతో తిరుమలలో సెలెబ్రిటీ యోగా డే నిర్వహిస్తామన్నారు. ప్రముఖులతో పాటు కనీసం ఐదు వేల మంది భక్తులు పాల్గొనేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు.




నడక మార్గానికి సమీపంలో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్ - కెమెరా ట్రాప్స్ పనితీరును పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

భక్తుల సంరక్షణే లక్ష్యంగా పనిచేయండి

● నడకమార్గాల్లో నిరంతర నిఘా ఉండాలి
● అటవీశాఖ అధికారులకు అదనపు ఈవో ఆదేశం

తిరుమల, మే28(ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తుల సంరక్షణే లక్ష్యంగా ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. వన్యమృగాల బారినపడి ఏ భక్తుడికి హాని జరగడానికి వీల్లేదన్నారు. నడక మార్గాలతో పాటు ఘాట్‌రోడ్లలో నిరంతర నిఘా ఉంచాలన్నారు. వరుస చిరుతల సంచారం నేపథ్యంలో బుధవారం ఆయన అలిపిరి నడకమార్గంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం(ఎన్ఎస్ టెంపుల్) వద్ద తనిఖీలు నిర్వహించారు. చిరుతల సంచారం అధికంగా ఉండే ఏడోమైలు నుంచి ఎన్ఎస్ టెంపుల్ వరకు నడకమార్గానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్‌ను పరిశీలించారు. వాటి పనితీరు గురించి ప్రభుత్వ అటవీశాఖ అధికారులు ఆయనకు వివరించారు. స్టాటిక్ కెమెరాలు, మోషన్ సెన్సార్ కెమెరాలు ఎలా ఉపయోగపడుతున్నాయనేది తెలియజేశారు. ఈనెల 21వ తేదీన ఎన్ఎస్ టెంపుల్ వద్ద కెమెరాకు చిక్కిన ఓ చిరుత దృశ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ.. సోలార్ కెమెరాలకు బూస్టర్లను ఫిక్స్ చేయడం ద్వారా అవి నిరంతరాయంగా పనిచేస్తాయని సూచించారు. కెమెరాల ముందు కనిపించే వన్యమృగాల సమాచారాన్ని టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ విభాగాలకూ తెలియజేసి సమన్వయంగా భక్తులను అప్రమత్తం చేయాలని ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులను కోరారు. అవసరమైతే మరికొన్ని కెమెరా ట్రాప్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దీనికి టీటీడీ సహకారం ఉంటుందన్నారు. నడక మార్గాల్లో భద్రతా సిబ్బందిని పెంచాలన్నారు.


ఎన్ఎస్ టెంపుల్ వద్ద ఫారెస్ట్‌లో అధికారులతో మాట్లాడుతున్న అదనపు ఈవో

కన్నీర్రజేసిన కడలి

విద్యార్థినిని మింగేసిన అలలు - శ్రీనివాససత్రంలో బాలిక మృతి

కోట, మే 28 (ఆంధ్రజ్యోతి): కడలి కన్నీర్రజేసింది.. సరదాగా గడిపేందుకు తల్లితో కలిసి సముద్ర తీరానికి వెళ్లిన బాలికను అలల రాకాసి మింగేసింది. కోట మండలం కొత్తపట్నం పంచాయతీ శ్రీనివాససత్రం గ్రామానికి చెందిన లక్ష్మయ్య, సౌమ్య దంపతుల కుమార్తె పల్లవి(12) ఎర్రావారిపాలెం మండలం ఉదయమాణిక్యంలోకి జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. వేసవి సెలవులకు ఇంటికి వచ్చిన బాలిక బుధవారం గ్రామంలోని మరో ముగ్గురు స్నేహితులతో పాటు తల్లితో కలిసి గ్రామానికి సమీపంలో ఉన్న బీచ్‌లో సరదాగా గడిపేందుకు వెళ్లింది. సుమారు రెండు గంటలపాటు తీరంలో ఉల్లాసంగా గడిపారు. ఒక్కసారిగా భారీ అలలు వచ్చి ఒడ్డున ఉన్న పల్లవి సముద్రంలోకి లాక్కెళ్లాయి. అక్కడే ఉన్న తల్లి తన బిడ్డ సముద్రపు నీళ్లలో కొట్టుకుపోతుండడంతో హతాశులయ్యారు. వెంటనే గ్రామస్తులకు చెప్పడంతో స్థానికంగా ఉన్న గజఈత గాళ్లు పడవలు, బోట్లతో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. గంటన్నర తరువాత ఒడ్డుకు చేరిన పల్లవిని గుర్తించి ఆఘమేఘాలపై చిల్లకూరు మండలంలోని చింతవరం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి గూడూరు ప్రభుత్వాస్పత్రి తరలిస్తుండగా మృతి చెందింది. గ్రామంలో ఆడుతూ పాడుతూ అందరినీ అలరించే పల్లవి మృతితో శ్రీనివాసస్రతంలో విషాద చాయలు అలుముకున్నాయి.


పల్లవి (ఫైల్‌ఫొటో)

చిరుతను ఢీ కొన్న వాహనం

● తీవ్ర గాయాలతో పాడుపడిన కోనేరులో మృతి
● ఆలస్యంగా వెలుగులోకి..

చంద్రగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన చిరుత.. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మామిడి తోటలో పాడుపడిన కోనేరులో మృతి చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హరిప్రసాద్‌రెడ్డి మామిడితోటలోని కోనేరులో చిరుత కళేబరాన్ని బుధవారం గొర్రెల కాపరి గుర్తించారు. ఈ సమాచారం మేరకు నాగపట్ల అటవీ సిబ్బంది కోనేరును పరిశీలించి, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో తిరుపతి ఎస్వీ జూపార్క్ వైద్యులు తోయబ సింగ్, నారావారిపల్లె వెటర్నీ డాక్టర్ వంశీ సంఘటనా స్థలంలోనే చిరుతకు పోస్టుమార్టం చేశారు. ఇది చిరుత చిరుత అని, సుమారు ఏడాది వయసు ఉంటుందని, ఎడమ వైపు మెడ దగ్గర, ఎడమ కాలు దగ్గర కమిలిన గాయాలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చిరుత శరీర భాగాలు, కాళ్ళు, గోళ్ళు, దంతాలు, చర్మం, బాగానే ఉన్నాయన్నారు. వారం కిందట వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయని, మూడు రోజుల కిందట కోనేరు వద్దకు వచ్చి మృతి చెందిందనట్లుగా భావిస్తున్నారు.


పాడుబడిన కోనేరు వద్ద చిరుత కళేబరం

పసుపు జాతర




రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..




మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు






నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు